# చెయిన్ సిస్టం జోలికి వెళ్ళవద్దు



- జిల్లా ఎస్పీ డాక్టర్.వినీత్
- మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్‌లతో ప్రజలు అప్రమత్తంగా వుండాలి

**నారాయణపేట,అక్షిత ప్రతినిధి:** ప్రజల సొమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్ళు రోజు,రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకోనేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు. మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని లిజిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు.

గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి, మీ క్రింద ఎక్కువ మంది ఎజెంట్లను మిగతా.. 2లో

www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
సోమవారం 20, ఏప్రిల్ 2026



# గులాబీ గర్జనకు సర్వం సిద్ధం

- ప్రజా ఆశీర్వాద సభ
- గులాబీ మయంగా జగిత్యాల పట్టణం
- గులాబీ గూటికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి
- జీవన్ రెడ్డికి కండువా కప్పనున్న కేసీఆర్




**జగిత్యాల, అక్షిత బ్యూరో:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. దాదాపు ఏడాది కాలం తర్వాత కేసీఆర్ ప్రజల ముందుకు వస్తుండటంతో, ఈ ప్రజా ఆశీర్వాద సభపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జగిత్యాల నియోజకవర్గ రాజకీయ సమీకరణాల్లో పలు మార్పులు చోటు చేసుకోబోతున్న ఈ సభ కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా, కీలక చేరికలకు వేదిక కానుంది. సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోనున్నారు. కేసీఆర్ స్వయంగా ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించనున్నారు. ఇది ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, వేముల ప్రశాంత్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు బాధ్యతగా అన్నింటినీ పర్యవేక్షిస్తున్నారు. సభకు వచ్చే కార్యకర్తలకు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు సమకూర్చారు. రేపు జరిగే సభలో కేసీఆర్ 'ఏం మాట్లాడబోతున్నారు'..

చాలా కాలం తర్వాత మైక్ పట్టనున్న కేసీఆర్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలు చేస్తారు?.. హామీల అమలుపై సర్కారును ఎలా నిలదీస్తారు? అన్నది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ముఖ్యంగా రైతాంగ సమస్యలు, సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై కేసీఆర్ ఘాటుగా స్పందించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# దండుగా కదలాలే సభ కిక్కిరిసాలే

- గులాబీ గర్జనను విజయ వంతం చేయాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** దండుగా కదలాలే.. సభ కిక్కిరిసాలే. గులాబీ సైన్యం తడాఖా చూసి కాంగ్రెస్ గుండెలు అదరాలే. జగిత్యాలలో సోమవారం నిర్వహించనున్న



బారాస బహిరంగ సభకు భారీ ఎత్తున ప్రజలు తరలిరావాలని మాజీమంత్రి, బారాస ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపు నిచ్చారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో మిగతా.. 2లో




# అభివృద్ధి అటుంచి అంతా రచ్చలే

- మున్సిపల్‌లో ఏం జరుగుతోంది....?
- అధికార విపక్షాల లొల్లి

**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి:** ఆర్మూర్ మున్సిపాలిటీలో ప్రస్తుతం పరిస్థితి చూస్తే... అభివృద్ధి చర్చలు కంటే రాజకీయ గొడవలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజా సమస్యలు, ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై చర్చ జరగాల్సిన సమావేశాలు... వ్యక్తిగత ఆరోపణలు, అధికార ధోరణి, ప్రోటోకాల్ ఉల్లంఘనలతో ఉద్రిక్తంగా మారుతున్నాయి.

ఎమ్మెల్యే సమీక్ష సమావేశం కూడా ఇదే పరిస్థితికి ఉదాహరణగా మారింది. కౌన్సిలర్ కాని వ్యక్తులు సమావేశాల్లోకి రావడం, అధికారుల ముందే హంగామా చేయడం... ఇవన్నీ మున్సిపల్ పరిపాలనలో క్రమశిక్షణ మిగతా.. 2లో

# సిద్దిపేట టీమ్ ఇండియాకు ఆడాలి

- మాజీ మంత్రి హరీష్ రావు
- కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ ఫైనల్‌లో గణేష్ నగర్ 11 విజయం
- వచ్చే ఏడాది మహిళల కోసం ప్రత్యేక క్రికెట్ టోర్నమెంట్
- క్రీడలతో పాటు జీవితంలోనూ ఆల్‌రౌండర్‌గా ఎదగాలి
- హరీష్ రావు యువతకు పిలుపు



**సిద్దిపేట, అక్షిత బ్యూరో:** సిద్దిపేట మట్టి బిడ్డలు టీమ్ ఇండియాలో ఆడాలని, బ్లూ జెర్సీ ధరించాలని నా కల అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. సిద్దిపేట స్టేడియంలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు క్రికెట్ కేవలం ఆట మాత్రమే కాదని, అది ఒక సమాజాన్ని కలిపే శక్తి అని హరీష్ రావు అన్నారు. మిగతా.. 2లో

# సిద్దిపేట టీమ్ ఇండియాకు ఆడాలి

మొదటి పేజీ తరువాయి..

ఒక జట్టు గెలవాలంటే ఒక్కరే కాకుండా మొత్తం 11 మంది తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. యువత కూడా జీవితంలో కలిసికట్టుగా ముందుకు సాగాలని, స్నేహం అంటే కేవలం వినోదానికి మాత్రమే కాకుండా జీవితాంతం తోడుగా ఉండాలని చెప్పారు.

సిద్దిపేట నుంచి ఇప్పటికే పలువురు క్రీడాకారులు రంజీ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అవుతున్నారని, ఇదే స్ఫూర్తితో మరింత మంది అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇండియా టీమ్‌లో కీలక పాత్ర పోషించిన తిలక్ వర్మ కూడా సిద్దిపేట స్టేడియంలో ఆడిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే సాధారణ కుటుంబం నుంచి వచ్చిన సిరాజ్ వంటి ఆటగాళ్లు దేశానికి గర్వకారణమయ్యారని తెలిపారు. ఈ టోర్నమెంట్ ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని, ఈసారి 92 జట్లు, 1380 మంది క్రీడాకారులు పాల్గొని 23 రోజుల పాటు పోటీలు జరిగాయని చెప్పారు. విజేతలకు లక్ష రూపాయలు, రన్నర్స్‌కు 50 వేల రూపాయల నగదు బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. మహిళా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వచ్చే ఏడాది నుంచి కేసీఆర్ ట్రోఫీలో మహిళల క్రికెట్ టోర్నమెంట్‌ను కూడా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మహిళలు కూడా అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని ప్రశంసించారు. చదువు, క్రీడలు, ఉద్యోగాల్లో ఏ రంగంలోనైనా నిరంతర సాధన అవసరమని, యువత నిజ జీవితంలో కూడా ఆల్‌రౌండర్లుగా ఎదగాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ఇక ఫైనల్ మ్యాచ్ గణేష్ నగర్ 11 మరియు కింగ్స్ ఖాదర్‌పూర్ జట్ల మధ్య ఉత్కంఠ భరితంగా సాగింది. చివరికి గణేష్ నగర్ 11 విజయం సాధించగా, రన్నర్స్‌కు 50 వేల రూపాయలు, విజేతలకు లక్ష రూపాయల బహుమతులను హరీష్ రావు అందజేశారు.

# వేసవి సెలవుల్లో అప్రమత్తమే భద్రత

**దొంగతనాల నివారణకు ప్రజల సహకారం అవసరం.**

**జిల్లా ఎస్పీ డి.జానకి**



**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** వేసవి సెలవుల్లో అప్రమత్తమే భద్రత - దొంగతనాల నివారణకు ప్రజల సహకారం అవసరం.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, వేసవి కాలంలో పాఠశాలల సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలు పెళ్లిళ్లు, పర్యటనలు, కుటుంబ సభ్యులతో బయటకు వెళ్లడం ఎక్కువగా జరుగుతుందని తెలిపారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. కాబట్టి జిల్లా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పోలీసులకు సహకరించాలని ఒక ప్రకటనలో సూచించారు.

దొంగతనాల నియంత్రణ కోసం ప్రజలు క్రింది సూచనలు తప్పనిసరిగా పాటించాలి:


- ఇంటి బయట లేదా డాబాలపై నిద్రించే వారు మెడలోని బంగారు ఆభరణాలపై జాగ్రత్త వహించాలి.
- ఇంట్లో అధిక మొత్తంలో బంగారం, నగదు ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచడం మంచిది.
- బస్సుల్లో ప్రయాణించే సమయంలో మీ సామాను జాగ్రత్తగా పట్టుకుని ఉండాలి. అపరిచితులు ఇచ్చే ఆహారం, పానీయాలు స్వీకరించవద్దు.
- ఊరికి వెళ్తున్నప్పుడు విలువైన వస్తువులు ఇంట్లో ఉంచకుండా భద్రంగా దాచుకోవాలి.
- బీరువా తాళాలు బయట కనబడే ప్రదేశాల్లో ఉంచకూడదు.
- ఇంటి తలుపులకు నాణ్యమైన తాళాలు ఉపయోగించాలి, తాళం బయటకు కనిపించకుండా జాగ్రత్త పడాలి.
- ఇంటి ముందు చెప్పులు ఉంచడం, లైట్లు ఆన్‌లో ఉంచడం ద్వారా ఇంట్లో ఎవరైనా ఉన్నట్లు భావన కలుగుతుంది.
- పేపర్ బాయ్, పాలు వేసే వారికి ముందుగానే తెలియజేయాలి.
- విశ్వసనీయమైన వాచ్‌మెన్‌లను మాత్రమే నియమించుకోవాలి.
- ఊరికి వెళ్లే ముందు స్థానిక పోలీస్ స్టేషన్‌కు మరియు నమ్మకమైన పొరుగువారికి సమాచారం ఇవ్వాలి.
- తరచుగా ఇంటి పరిస్థితి గురించి పొరుగువారిని సంప్రదించండి.
- బయటకు వెళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దు.
- ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా భద్రతను పెంచుకోవచ్చు.
- సీసీ కెమెరాలను రహస్య ప్రదేశాల్లో ఉంచి, మొబైల్ యాప్ ద్వారా పర్యవేక్షణ కొనసాగించాలి.
- బయట తిరుగుతున్నప్పుడు, ముగ్గులు వేస్తున్నప్పుడు మెడలోని ఆభరణాలను జాగ్రత్తగా కవర్ చేసుకోవాలి.
- ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 100 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలి.

జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే దొంగతనాలను అరికట్టడం సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన పదవ తరగతి మూల్యాంకనం

**-జిల్లా విద్యాధికారి రాముని సన్మానించిన పిఆర్టియు టిఎస్**

**జగిత్యాల, అక్షితబ్యూరో:** జగిత్యాల పట్టణము లోని మౌంట్ కార్మెల్ హై స్కూల్, ధరూర్



లో ఈ ఏప్రిల్ నెల 1వ తేదీ నుండి 19వ తేదీ వరకు 19 రోజులు పదవ తరగతి మూల్యాంకనం జరుగగా ఈ మూల్యాంకనంలో 1,35,621 జవాబు పత్రాలను మూల్యాంకనం చేశారు . ఈ మూల్యాంకనానికి 7గురు అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు గాను, 385 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు గాను, 65 మంది చీఫ్ ఎగ్జామినర్లు గాను, 130 మంది స్పెషల్ అసిస్టెంట్లు గాను పని చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు జిల్లా విద్యాశాఖ అధికారి మరియు క్యాంప్ ఆఫీసర్ కె రాముని మరియు డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ చంద్రకళ ని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్, జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బోయినిపెల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి యాళ్ల అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు రాష్ట్ర నాయకులు రామస్వామి సురేందర్ రాజేందర్ విజయరావు శివ కళ్యాణ్ రాజేష్ పద్మ నాగారాణి శ్రీమతి స్వాతి అర్చన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ స్పాట్ వాల్యుయేషన్ విజయవంతం చేసినందుకు ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు.

# చెయిన్ సిస్టం జోలికి వెళ్లవద్దు

మొదటి పేజీ తరువాయి..

చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తూ చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు,పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు.ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు.సైబర్ మోసగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు.సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్నుతారని ఎలాంటి మాయ మాటలు నమ్మరాదు అని ఎస్పీ తెలిపారు.

అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోస మని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు, అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. గొలుసుకట్టు మార్కెటింగ్‌లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్వర్క్ లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్లవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి, అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకే ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.

# దండుగా కదలాలే సభ కిక్కిరిసాలే

మొదటి పేజీ తరువాయి..

ఇచ్చిన హామీలే కాకుండా ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొట్టే విధానం తప్ప ఇప్పటి వరకు తెలంగాణ ప్రజలకు చేసింది శూన్యమన్నారు. కెసిఆర్ బయటకు రాడు అని విమర్శలు చేసే కాంగ్రెస్ నాయకులకు కెసిఆర్ జగిత్యాల సభతో బయటికి వస్తున్న అనగానే భయం పుట్టి రేపు ఎల్లుండో రైతుబంధు వేస్తానని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రజలకు. కెసిఆర్ కిట్టు, దళిత బంధు, వృద్ధులకు పెన్షన్, రైతు బీమా, రైతు భరోసా, కళ్యాణ లక్ష్మి ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, ఈ పథకాల పైన ఇంతకు రెట్టింపు ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలను ఇచ్చి గద్దెనెక్కి కెసిఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలన్నిటిని బంద్ చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలకు పనికివచ్చే ఏ ఒక్క ప్రాజెక్టు కట్టకుండానే ఈ రెండున్నర ఏళ్ల కాలంలో మూడున్నర లక్షల కోట్ల అప్పు చేసిందన్నారుకాంగ్రెస్ పార్టీ పతనం జగిత్యాల నుండే ప్రారంభం అవుతుందన్నారు. జగిత్యాలలో జరిగే బారాస బహిరంగ సభలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి కెసిఆర్ సమక్షంలో పార్టీలో చేరబోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, జిల్లా గ్రంధాల సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు ఐలేందర్ యాదవ్, గందె మహేశ్, మైనార్టీ నాయకులు మీర్ సౌకత్ ఆలీ, నారదాసు వసంతరావు, గూడెల్లి రాజ్ కుమార్, పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అటుంచి అంతా రచ్చలే

మొదటి పేజీ తరువాయి..

లోపాన్ని చూపిస్తున్నాయి.

**ప్రస్తుతం కనిపిస్తున్న సమస్యలు**

సమావేశాల్లో ప్రోటోకాల్ పాటించకపోవడం
అధికార పార్టీ – ప్రతిపక్షం మధ్య సమన్వయం లేకపోవడం
కౌన్సిలర్ల స్థానంలో ఇతరులు జోక్యం చేసుకోవడం
అభివృద్ధి అంశాలు పక్కకు వెళ్లి రాజకీయ రగడలు ముందుకు రావడం

**దీని ప్రభావం ఏమిటి?**

ఇలా కొనసాగితే మున్సిపల్‌లో తీసుకోవాల్సిన కీలక నిర్ణయాలు ఆలస్య మవుతాయి. రోడ్లు, డ్రైనేజ్, నీటి సమస్యలు, పాఠశాలలు వంటి అంశాలు నిర్లక్ష్యానికి గురయ్యే ప్రమాదం ఉంది.

**ప్రజల్లో ఆందోళన**

మాకు అవసరం అభివృద్ధి… కానీ నాయకులు మాత్రం గొడవల్లో బిజీ అనే భావన ప్రజల్లో పెరుగుతోంది. నాయకులు ఇలా తగువులాడుకుంటే… ఆర్మూర్ అభివృద్ధి ఎవరు చూసుకుంటారు?

ఇప్పటికైనా అన్ని పార్టీల నాయకులు బాధ్యతగా వ్యవహరించి, వ్యక్తిగత విభేదాలు పక్కనపెట్టి, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
సోమవారం 20, ఏప్రిల్ 2026



## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**గద్వాల, అక్షిత న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజక వర్గంలోని, అలంపూరు మండల కేంద్రంలో తెలంగాణ మార్క్ ఫెడ్ వారి సౌజన్యంతో అలంపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించడం జరిగినది. ప్రభుత్వ కనీస మద్దతు ధర 2400 క్వింటాలుకు నిర్ణయించడం జరిగినది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కజొన్న పంట కోసిన తర్వాత రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియ జేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

**నాగర్ కర్నూల్,అక్షిత ప్రతినిధి:**



11 కేవీ విద్యుత్ లైన్‌లో జంపర్ కలపడానికి వెళ్ళి విద్యుత్ షాక్ కు గురైన విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేసే కూలి వెంకటయ్య (35) విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సబ్ స్టేషన్ లో మరమత్తు పనుల కోసం కొల్లాపూర్ మండలం కోడికిల గ్రామం నుంచి వచ్చిన కూలి చేత ఇతర విద్యుత్తు పని చేయించడంతో విద్యుత్ షాక్ కు గురైనట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ముందుగానే ప్రకటించిన అధికారులు విద్యుత్ సరఫరా నిలిపియడంలో నిర్లక్ష్యంగా వహించినట్లుగా తెలుస్తోంది. విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యుత్ పనులపై అవగాహన లేని, విద్యుత్ శాఖకు సంబంధం లేని మామూలు దినసరి కూలి చేత విద్యుత్ సరఫరా ఉన్నచోట ఎందుకు పని చేపించారనేది ప్రశ్నార్ధకంగా ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## కరాటే విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్‌లు అందజేత

**వనపర్తి అక్షిత ప్రతినిధి:**

కొత్తకోట మండలంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో వనపర్తి తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో తైక్వాండో కలర్ బెల్ట్ గ్రేడ్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వివిధ గ్రామల నుండి కొత్తకోట మున్సిపాలిటీకి సంబంధంచిన 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రతిభ చాటిన విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మధనాపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ పి. ప్రశాంత్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ రెడ్డి, కౌన్సిలర్లు ఎన్ జె బోయోజ్, జి.మురళి యాదవ్, మంజుల రామకృష్ణ యాదవ్, సుబాష్, సత్యం సాగర్, చంద్రకాంత్, రామ్మోహన్ రెడ్డి, సంజీవ్, ఎన్.అయన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.వెంకటేశ్వర్లు, పెండెం శంకర్ యాదవ్, తరుణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ మాస్టర్లు దేశి.పెంటన్న యాదవ్, నరేందర్ సాగర్, నరేష్ నాయుడు, రమేష్ రెడ్డి, పరుశురాములు, శివశంకర్, రవికుమార్,మాధవ్,సురేష్, యాదగిరి విద్యార్థులను అభినందిచారు.





# జగిత్యాలలో ఘనంగా హిందు సమ్మేళనం

**జగిత్యాల, అక్షితబ్యూరో:**

జగిత్యాల పట్టణంలో గణేష్ నగర్‌లోని ఎల్ జి గార్డెన్స్‌లో మరియు విద్యానగర్‌లోని రామాలయం వద్ద బస్తి హిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ బస్తి హిందు సమ్మేళనం

కార్యక్రమం హిందూ సమాజం యొక్క ఐక్యతను, సంస్కృతిని చాటిచెప్పేలా సాగింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు, హిందూ బంధువుల తో ప్రాంగణమంతా కాషాయమయమై ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఎల్జీ గార్డెన్స్‌లో జరిగిన హిందు సమ్మేళనము కార్యక్రమంలో భార్గవి కల్యాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ

దేశం అభివృద్ధి పథంలో పయనించాలంటే హిందువులందరూ కులమతాలకు అతీతంగా ఏకతాటి పైకి రావాలి. హిందూ సమాజం ఎంత పటిష్టంగా ఉంటే దేశం అంత సురక్షితంగా ఉంటుంది అని భార్గవి కళ్యాణి స్పష్టం చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం వల్ల వ్యక్తిలో ధైర్యం, క్రమశిక్షణ వంటి ఉన్నత గుణాలు పెంపొందుతాయని ఆమె వివరించారు. విద్యానగర్ రామాలయంలో జరిగిన బస్తి హిందూ సమ్మేళనము లో డాక్టర్ శిల్పాదీదీ ఈ సమ్మేళనాని కి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో శిల్పాదీది మాట్లాడుతూ సంస్కృతే మన జీవననాడి హిందూ ధర్మం కేవలం ఒక మతం కాదని, అది ఒక ఉన్నతమైన జీవన విధానమని పేర్కొన్నారు. ఈ బస్తి హిందు సమ్మేళనములలో పట్టణంలోని హిందూ బంధువులు పెద్ద ఎత్తున తరలి వచ్చి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

రానున్న రోజుల్లో ప్రపంచమంతా హిందుత్వం వైపు, భారతీయ ధర్మం వైపు చూస్తుందని వక్తలు ధీమా వ్యక్తం చేశారు.ప్రజల భాగస్వామ్యంతో జగిత్యాల హిందూ సమ్మేళనం చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతమైంది ఎల్జీ గార్డెన్స్ లో జరిగిన బస్తి హిందు సమ్మేళనం లో ప్రముఖ నృత్య దర్శకురాలు యమున వద్ద శిక్షణ పొందిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గోవిందుపల్లె బస్తి హిందూ సమ్మేళన అధ్యక్షుడు వంగల భాస్కరాచారి, ముఖ్యఅతిథి కొత్తకొండ శివానంద చార్య, వక్త భానుచందర్, మహిళా వక్త భార్గవి కళ్యాణి, కార్యదర్శి మానాల కిషన్, అద్వైత శ్రీ చక్రపీఠం శ్రీపాద లక్ష్మీ నరసింహ శాస్త్రి, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం పాల్గొన్నారు. బస్తీ ప్రజలతో ఎల్జీ గార్డెన్ ఫంక్షన్ హాల్, ఏడ్ల అంగడి రామాలయం ప్రాంతాలు కిక్కిరిసిపోయి హిందువుల ఐక్యతను చూపించాయి.చివరగా ఐకమత్యమే మహాబలము అని, హిందూ సమాజం యొక్క శక్తిని చాటి చెప్పే ఇలాంటి సమ్మేళనాలు రాష్ట్ర స్థాయిలో జరిపి మరింత చైతన్యాన్ని నింపుతాయని సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం మరియు నిర్వాహకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం వచ్చిన వారందరికీ, అల్పాహారం, భోజనం నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

# వరంగల్ జిల్లా సైకిల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జనరల్ బాడీ సమావేశంలో ఎన్నికలు ఓసిటి




మైదానం లో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ సైకిలింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్నబోయిన సారయ్య అధ్యక్షతన నిర్వహించారు. వరంగల్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఉప్పుల రాజు కార్యదర్శిగా కన్నబోయిన నిశాంత్ యాదవ్ ట్రెజరర్ గా సారంగపాణి ఉపాధ్యక్షులుగా సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, ఆర్ఎస్ఐ రణధీర్,కంది భరత్, జాయింట్ సెక్రటరీగా కరుణాకర్, సతీష్, శ్రీరాం నాయక్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా సందీప్ ను ఎన్నుకున్నారు.

ఈ ఎంపికకు అబ్జర్వర్‌గా రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ట్రెజరర్ వెంకట్ నరసయ్య వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బైరవైన కైలాష్ యాదవ్, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పెబ్బేర్ ఎస్సైగా వెంకటేష్ గౌడ్ బాధ్యతలు

**వనపర్తి అక్షిత ప్రతినిధి**




వనపర్తి జిల్లా పరిధిలోని పెబ్బేర్ మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై గా వెంకటేష్ గౌడ్ ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ యుగంధర్ రెడ్డి ప్రస్తుతం నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి విఆర్ ఎస్సైగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గతంలో వనపర్తి పట్టణ టౌన్ ఎస్సైగా, ఖిల్లా గణపురం పోలీస్ స్టేషన్ ఎస్సైగా పనిచేసిన వెంకటేష్ గౌడ్ నాగర్ కర్నూలు జిల్లాలోని లింగాల పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా పనిచేస్తున్న సందర్భంగా ఆయన ను పెబ్బేరు ఎస్సైగా బదిలీ చేశారు. శాంతిభద్రతల విషయంలో గతంలోనే పోలీస్ శాఖలో మచ్చలేని అధికారిగా పేరు పొందుతూ నల్లమల్ల అడవి ప్రాంతంలో గిరిజన గిరి పుత్రులతో ఆయన సేవలు విశిష్టంగా అందిస్తూ లింగాల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా ఆయన పేరు ప్రతిష్టలు పొందారు.

అలాంటి ముక్కసూటి మనిషి పోలీస్ శాఖలో అంచలంచెలుగా ఎదగాలని పెబ్బేరు మండలంలోని శాంతిభద్రతల విషయంలో ఆయన శక్తివంతం లేకుండా కృషి చేస్తారని ఆ మండల ప్రజలు ఆశిస్తున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి సుశీల శ్రీనివాస్ గౌడ్ తో పాటు జై గౌడ ఉద్యమ నాయకుడు సుగూరు రాజశేఖర్ గౌడ్ తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకుడు గౌడ సంఘం నాయకులు నూతన ఎస్సై వెంకటేష్ గౌడ్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంకితభావంతో పనిచేసే ఎస్సైగా వెంకటేష్ గౌడ్ గతంలో వనపర్తి జిల్లాల్లో ఎంతో పేరు ప్రతిష్టలు పొందినట్లు ఆయన సేవలు ఈ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోలీసులకు సహకరించాలని రాజకీయ పార్టీల నాయకులు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# నగర అభివృద్ధి ప్రజారోగ్య సంరక్షణ
# మా పాలకవర్గ ధ్యేయం...

**- మేయర్ కోలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, అక్షిత బ్యూరో:** నగర అభివృద్ధి ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా తమ పాలకవర్గం పని చేస్తుందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా ఆదివారం ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న 2వ డివిజన్‌లో పర్యటించారు. తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో గల అపార్ట్ మెంట్స్ వద్ద కాలనీ వాసులతో కలిసి సుమారు 15 లక్షల నిధులతో ఓపెన్ జిమ్ము ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం ఓపెన్ జిమ్ము పరికరాల ఏర్పాటు పనులను వేగవంతంగా పూర్తి చేసి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. స్థానిక మహిళలను పలు సమస్యలు అడిగి తెలుసుకొని త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా తీగలగుట్టపల్లిలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో ఓపెన్ జిమ్ము ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. స్థానిక మహిళలు, ప్రజల కోరిక మేరకు ఓపెన్ జిమ్ము కావాలని మా దృష్టికి తెచ్చిన నాలుగు రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వంకు చెందిన సుమారు 15 లక్షల నిధులతో ఓపెన్ జిమ్ము ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత జీవన శైలిలో వ్యాయామం చాలా ప్రధానమైందన్నారు. ప్రతి రోజు ఉదయం 40 నిమిషాలు వ్యాయామంతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందని తెలిపారు. మహిళలు, యువత, వృద్ధుల స్థానిక ప్రజల వ్యాయామం కోసం అత్యాధునిక పరికరాలతో కూడిన ఓపెన్ జిమ్ అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. అన్ని రకాల వ్యాయమ పరికరాలను ఏర్పాటు చేసి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించామని తెలిపారు. డివిజన్ ప్రజల కోరిక ప్రకారం సమీపంలోని చెరువు కట్టను సుంధరీకరంగా మార్చాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దృష్టికి తీసుకెల్లడంతో దాని అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించారని తెలిపారు. త్వరలోనే బండి సంజయ్ కుమార్ సహకారంతో చెరువు గట్టు సుంధరీకరణ పనులను ప్రారంభం చేసి స్థానిక ప్రజలకు అందిస్తామని తెలిపారు.

డివిజన్ ప్రజలు నా దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. డివిజన్ ప్రజల ఆశీస్సులతో కార్పోరేటర్‌గా గెలిచి మేయర్ అవడం జరిగింది. దానికి తీగలగుట్టపల్లి డివిజన్ ప్రజల ఆశీస్సులే అన్నారు. మీ ఆశీస్సులు ఎల్లప్పుడు మా పై ఇలాగే ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# పండుగలా 'హ్యాపీ సండే'!

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ ద్వారా నిర్వహించిన 'హ్యాపీ సండే' కార్యక్రమం అద్భుతంగా సాగింది . నగర వాసులందరినీ ఒకే చోట చేర్చి, ఉత్సాహాన్ని నింపడంలో ఈ వేడుక అద్భుతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మల మమతా శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రామాంజుల రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్ లు ప్రజలతో కలిసి సందడి చేశారు. చిన్నారుల ఆటపాటలు, డ్యాన్స్‌లు కేరింతలతో హ్యాపీ సండే కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది పిల్లలతో కలిసి తల్లిదండ్రులు సరదాగా గడిపారు.

స్థానిక కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ద్వారా ఉల్లాస పరిచారు నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్ మాట్లాడుతూ

ఆరోగ్యం, ఉల్లాసం కోసం ప్రత్యేక ఆకర్షణలు ?ఒత్తిడి లేని జీవనం, స్నేహపూర్వక వాతావరణమే లక్ష్యంగా సాగిన హ్యాపీ సండే కార్యక్రమం అందరికీ ఒక తీపి జ్ఞాపకం గా మిగులుతుందని అన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికి
# పోరాటాలకు సిద్ధం కావాలి

**తల్లాడలో తెలంగాణ రైతు సంఘం**

**ఖమ్మంజిల్లా తృతీయ మహాసభలు**

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను మరింత ఉద్ధృతం చేయాలని తెలంగాణ రైతు సంఘంనాయకులుపిలుపునిచ్చారు. ఆ సంఘం ఖమ్మంజిల్లా తృతీయ మహాసభలు సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని తల్లాడ మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపం,సామినేని రామారావు నగర్‌లోని కాసాని ఐలయ్య ప్రాంగణంలో త్వరలో జరగనున్నశీదున ఆదివారం నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీనియర్ నాయకులు తాతాభాస్కరరావులు ప్రసంగించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం,మొక్కజొన్న కొనుగోలు సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, భూభారతి పోర్టల్ లో లోపాల వల్ల



రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భూమి కలిగిన ప్రతి రైతుకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు సీతారామ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేసి, రూ. 9 వేల కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకుమరమ్మతులు చేపట్టి, రైతులకు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు రకాల పంటలకు బోనస్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను గుర్తించి 2011సాగుదారు చట్టం ప్రకారం గుర్తింపు కార్డులు జారీ చేసి, బ్యాంకు రుణాలు, పంట అమ్మకాలు, ఎరువుల సబ్సిడీలలో వాటిని ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. గ్రామ సభలు నిర్వహించి కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విత్తన చట్టం, విద్యుత్ సంస్థల మార్కెట్ ముసాయిదా బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తూ మహాసభల్లో రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి, నల్లమోతు మోహన్ రావు, కళ్యాణపు కృష్ణయ్య, గుంటుపల్లి వెంకటయ్య, సత్తెనపల్లి నరేష్, షేక్ మస్తాన్, గండమల ఆనందరావు, పెరసాని వెంకటయ్య, పులి వెంకట నరసయ్య తదితరులుపాల్గొన్నారు.

# అక్షయ తృతీయలో
# బాల్య వివాహాలు చేయరాదు

**నడింపల్లి కేజీబీవీ లో విద్యార్థులకు అవగాహన సదస్సు**

**ఉమామహేశ్వరం దేవాలయం లో భక్తులకు అవగాహన**

**జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీశైలం**

**అచ్చంపేట, అక్షిత ప్రతినిధి:** అక్షయ తృతీయలో భాగంగా బాల్య వివాహాలు చేయరాదని ఆదివారం అచ్చంపేట మండల పరిధిలోని నడింపల్లి కేజీబీవీ పాఠశాలలో మరియు ఉమామహేశ్వర దేవాలయం దగ్గర భక్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యాక్సెస్ టు జస్టిస్ ప్రాజెక్టు లో భాగంగా కోనేరు ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా బాలల సంరక్షణ అధికారి శ్రీశైలం పాల్గొని మాట్లాడుతూ వేసవి సెలవుల సమయంలో విద్యార్థులు ఇంటి దగ్గరికి వెళ్లిన తర్వాత పిల్లలకు బాల్య వివాహాలు చేయాలని చాలామంది తల్లిదండ్రులు ఆలోచన చేస్తారు వాటికి మీరు






నిరాకరించాలని వెంటనే 1098 కు కాల్ చేయాలని తెలియజేశారు. బాల్య వివాహాలు చేసుకోవడం ద్వారా వచ్చే నష్టాల గురించి వివరించారు. అదేవిధంగా ఉమామహేశ్వరం దేవాలయం దగ్గర భక్తులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. పూజారులు బ్రాహ్మణులు పాల్గొన్నారు. ఉమామహేశ్వర దేవాలయంలో బాల్యవివాహాలు చేయకుండా హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశామని ఇక్కడ బాల్య వివాహాలు జరగవని తెలియజేశారు. భక్తులకు బాల్య వివాహాల వల్ల నష్టాల గురించి వివరించారు. బాల్య వివాహాల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అచ్చంపేట చర్చిలో బాల్య వివాహాలు చేయరాదని అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 చట్ట ప్రకారం బాల్య వివాహంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ కూడా శిక్ష కు బాధ్యులుగా అవుతారని అన్నారు.

లక్ష రూపాయల జరిమానాలతో పాటు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిపిసి మల్లేష్. కోనేరు ఎస్‌జిఓ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు. ఏరియా కోఆర్డినేటర్ జాకీర్ హుస్సేన్. తదితరులు పాల్గొన్నారు




## చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:**

సత్తుపల్లి మండల పరిధిలోని బేతుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం గ్రామ పంచాయతీ సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు బాబు) తనజన్మదినాన్నిపురస్కరించుకొని రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.అనంతరం గ్రామ ప్రజలకు మట్టి కుండలలో నింపిన త్రాగు నీటిని బాటసారులకు,చిన్నారులకు,ప్రజలకు అందజేశారు.ఆయన మాట్లాడుతూ ప్రతి నీటి బిందును ఒడిసి పట్టాలని,త్రాగునీటిని వృథా చేస్తే భావితరాలకు అన్యాయం చేసినట్లు అవుతుందని నీటి పొదుపు అందరి బాధ్యతగా గుర్తించాలని,వృథా చేయకూడదని తెలిపారు.ఈ కార్యక్రమంలో:అమ్ములు బాబు అభిమానులు,గ్రామ పంచాయతీ కార్మికులు,వైస్ సర్పంచ్ చిట్టిమాది చెన్నకేశవులు,వార్డుసభ్యులు పాల్గొన్నారు.

## నాగార్జున పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం “ఆరోహణ”

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** మండల కేంద్రంలోని నాగార్జున పాఠశాలలో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది “ఆరోహణ” అనే థీమ్‌ను ఎంపిక చేసి విద్యార్థుల్లో ఉన్నత లక్ష్యాల సాధనపై చైతన్యం కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇంటెలిజెన్స్ సీఐ దుబ్బ కిషన్ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. జబర్దస్త్ ఫేమ్ రాజమౌళి విద్యార్థులు కృషితో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని






ఆకాంక్షించారు.అసిస్టెంట్ ప్రొఫెసర్ కట్ట శేఖర్ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించగా, డాక్టర్ నాగేశ్వరరావు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ స్కాలర్ పి.శ్రీనివాస్ ప్లే వే మెథడ్ ద్వారా విద్యార్థులు సులభంగా నేర్చుకుంటారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ నాగరాజు వార్షికోత్సవ ప్రాముఖ్యతను వివరించి విద్యార్థులు సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు.

ప్రిన్సిపాల్ శ్రీమతి రేఖ వార్షిక నివేదికను సమర్పించి పాఠశాల విజయాలు, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు.కార్యక్రమంలో తల్లిదండ్రులు జిక్ర తబస్సుం, వసుంధర తమ అనుభవాలను పంచుకున్నారు. ఉపాధ్యాయులు అక్రమ్, సంతోష్, నరసింహ, సంధ్య, విజయ్ శ్రీ, వినిషలత తదితరులు పాల్గొన్నారు.



# శిదిలావస్థకు చేరిన అసిఫ్ నగర్ కాలువ కట్టను మరమ్మత్తు చేయాలి

**గుర్రపు డెక్క ఆకును తొలగించి రైతుల సమస్యను పరిష్కరించాలి**

**సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం**

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:**

మునిపంపుల గ్రామ పరిధి అసిఫ్ నహర్ కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకును తొలగించి శిథిలావస్థకు చేరిన కాల్వకట్టను మరమ్మత్తులు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి, గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పోరుయాత్రలో భాగంగా గ్రామ నాయకత్వంతో కలిసి అసిఫ్ నగర్ (రాచకాల్వను) పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి నిరాటంకంగా ముసి నీరు వస్తుండడంతో తూటీకూర, గుర్రపు డెక్కాకు చెత్త అపరిస్కృతంగా చెట్లు పెరిగి నీరు వెళ్లకుండా సమీప పొలాల మీదుగా పోవడంతో అనేక మంది రైతులు పంటలను పడవా పెట్టుకోవడం జరిగిందని అన్నారు. కింది పొలాలు జాలుబట్టిపోయి దున్నడానికి, వరి చేను కోయడానికి చాలా ఇబ్బందికరంగా మారుతుందని అన్నారు. అధిక వర్షాలు సంభవించినప్పుడు గ్రామం మీదుగా రాచకాలువ నీరు కట్టమీద నుండి పొరలి ప్రమాదకరంగా మారుతుందని పలు సందర్భాల్లో కట్ట తెగి పంట పొలాలు నష్టం జరిగిందని అన్నారు.రైతుల పోరాటంతో నీటిని కొంత మేరకు ఆపడం జరిగింది కానీ ఇదే సందర్భంలో వెంటనే కాల్వలో పేరుకుపోయిన ఆకును తొలగించాలని. కట్టకు విరిగా పెరిగిన కంపచెట్లను తొలగించాలని మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వేలాది ఎకరాలకు సాగునీరు అందించే ప్రధాన నీటి వనరు ఆసిఫ్ నగర్ కాలువ అని తీవ్రమైన సమస్యను ప్రభుత్వ అధికార యంత్రాంగం వెంటనే చొరవ తీసుకొని పరిష్కారం చేయాలని లేని పక్షంలో రైతులను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు



తలుపునూరి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్,వార్డు సభ్యులు గంటెపాక శ్రీను, బూడిద నర్మదనర్సింహ,నాయకులు తొలుపునూరి చంద్రశేఖర్, గంటపాక శివకుమార్, మేడి ముకుంద,ఎండి మైనొద్దీన్, ఉంద్రాతి నరసింహ, బూడిద బిక్షం గునుగుంట్ల సత్యనారాయణ, మేడి భాషయ్య, గంటెపాక చిన్న ముత్యాలు,గంటెపాక శ్రీకృష్ణ,కనుకుంట్ల ఉపేందర్, పోగుల ఉపేందర్, బొడ్డుపల్లి ఉపేందర్, జంపాల మహేష్, బోనగిరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే వడ్ల కొనుగోలు ప్రారంభించి రైతులను ఆదుకోవాలి

**- మాజీ జడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్**

**వనపర్తి అక్షిత ప్రతినిధి:** వెంటనే వడ్ల కొనుగోలు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని మదనాపురం మాజీ జడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మదనాపురం మండలంలో బిఆరెస్ మండల నాయకులతో కలిసి రైతులు ఆరబోసిన దాన్యాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్



ప్రభుత్వం ప్రజాపాలన అని అన్నివర్గాల వారిని మోసం చేస్తూ కనీసం రైతులకు కూడా న్యాయం చేయలేకపోతుందని మండిపడ్డారు. పంటలు చేతి కొచ్చి వ్యవధి దాటిపోతున్న ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం కనీసం గన్ని బ్యాగులు కూడా సమకూర్చకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం అని ఎద్దేవా చేశారు. ఇవేవీ పట్టించుకోకుండా దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి ప్రతిపక్షం మీద ప్రతిపక్షా నాయకుల మీద ముఖ్యంగా దేవరకద్ర ముద్దుబిడ్డ అభివృద్ధి ప్రదాత ఆల వెంకటేశ్వర్ రెడ్డిని విచక్షణారహితంగా తన యొక్క లోపాలను కప్పిపుచ్చుకునుటకు విమర్శిస్తున్నాడని మండిపడ్డారు. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందుగా రైతులకు న్యాయం చేయండి పంటను సకాలంలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోండని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల బిఆరెస్ పార్టీ అధ్యక్షులు బిట్లీ యాదగిరి, సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, అజ్జకొల్లు సర్పంచ్ మల్లేష్, ఉప సర్పంచ్ అశోక్, మాజీ కోఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, టౌన్ అధ్యక్షులు ఆవుల బాలకృష్ణ, ముఖ్య నాయకులు అనిమౌని మాసన్న, మాజీ మార్కెట్ డైరెక్టర్ దేశీ వెంకటేశ్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గన్నేపల్లి మనోజ్ కుమార్, దుప్పల్లి మాజీ సర్పంచ్ శివశంకర్ నాయుడు, తిరుమలాయపల్లి మాజీ ఎంపీటీసీ రామ్ చందర్, సీనియర్ నాయకులు రాఘవులు, బిఆరెస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాంచందర్, మండల బిఆరెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రపాలనగరంను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

### శిథిలావస్థకు చేరిన చెరువుతోములను మరమ్మత్తు చేయాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్

**రామన్నపేట. అక్షిత ప్రతినిధి:** చారిత్రత్మాక గ్రామమైన ఇంద్రపాలనగరంను పర్యాటక కేంద్రంగా మార్చి శిథిలావస్థకు చేరిన చెరువు తూములను మరమ్మత్తు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పోరుయాత్రలో భాగంగా ఇంద్రపాలనగరంలో గ్రామ శాఖ నాయకత్వంతో కలిసి పలు



సమస్యలను పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీ.శ ఆరవ శతాబ్దంలో విష్ణుకుండ్యుల రాజధానిగా చేసుకొని పాలించిన చారిత్రాత్మక ప్రదేశం నేడు నిరాధారణకు గురై పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నెలకొన్నదని అన్నారు. నాలుగు దశబ్దాలుగా ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి హయాం నుండి ఇంద్రపాలనగరంను పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇస్తూ అమలుకు నోచుకోకుండా పోతుందని ఇతర ప్రాంతాల నుండి పర్యాటకులు వస్తే కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదని వాపోయారు. నాటి పురాతన ప్రతిమలన్నీ శిథిలమై గుర్తుతెలియని వ్యక్తుల తవ్వకాలతో ధ్వంసమైపోతున్నాయని పురావస్తు శాఖ చొరవ తీసుకొని వీటిని పరిరక్షించి, పర్యారకులకు కాటేజీలు ఏర్పాటు చేసి గ్రామానికి రెవిన్యూ పెంచాలని ప్రభుత్వం వెంటనే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి సౌకర్యాలు కల్పించాలని అదేవిధంగా




శిథిలావస్థకు చేరిన చెరువు తూములను వెంటనే మరమ్మత్తు చేయాలని గత కాలం నుండి ప్రమాదకరంగా ఉండి ఇద్దరు మరణించడం జరిగిందని చెరువుకు ప్రధాన తోము కావడంతో రైతులు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరమ్మతులు చేసి వెంటనే సమస్య పరిష్కరించాలని అన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక చొరవ చూపించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య,మండల కమిటీ సభ్యులు మీర్ ఖాజా అలీ, శాఖ కార్యదర్శి గన్నెబోయిన శ్రీనివాస్, కొంగరి నర్సింహా, నాయకులు కొమ్మగోని అశోక్, భువనగిరి అశోక్, నాగు నర్సింహా, రాదారపు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# సర్వేంద్రియానం నయనం ప్రధానం

### వి.ఏం.బంజర్‌లో మెగా నేత్ర వైద్య శిబిరం

### ప్రారంభించిన ఏసిపి వసుంధర యాదవ్ ఐపిఎస్

### సేవే నా దృక్పథం:జెన్నారెడ్డి నరసింహారెడ్డి(విశ్రాంత పోలీస్ సీఐ)

### శ్రీ రాజసాయి మందిరం ఫౌండర్ విజయ జ్ఞాపకార్థం క్యాంప్"

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** ఆదివారం ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని పెనుబల్లి మండలంలోని వి.ఏం.బంజర్ పట్టణంలో కొలువై యున్న షిర్డీ సాయిబాబా శ్రీ రాజసాయి మందిరం ఫౌండర్ జెన్నారెడ్డి విజయ జ్ఞాపకార్థం ఆమె భర్త విశ్రాంత పోలీస్ సీఐ జెన్నారెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బంజర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిరణ్ నేత్ర వైద్యశాల కాకినాడ వారి సహకారంతో మెగా నేత్ర వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.అట్టి శిబిరాన్ని కల్లూరు ఎసిపి వసుంధర యాదవ్ ఐపిఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి పరీక్షలను ప్రారంభించారు.కంటి పరీక్షలు చేసే అన్ని గదులను ఆమె స్వయంగా తిరిగి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.శిబిరం పూర్తి వివరాలను అడిగితెలుసుకున్నారు.వృద్ధాప్యంలో కూడా విశ్రాంతి తీసుకోకుండా సమాజ సేవ చేయడానికి కృషి చేస్తున్న జెన్నారెడ్డి నరసింహారెడ్డి ని అభినందించారు.అనంతరం నిర్వాహకులు వసుంధర యాదవ్ కు శాలువా కప్పి పుష్పాలు వేసి ఘనంగాసత్కరించారు.ముందుగా వసుంధర యాదవ్ కు సంప్రదాయ మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు.ఆమెతో పాటు పోలీస్ ఎస్ఐ,సిబ్బంది ఉన్నారు.ఈ శిబిరానికి చుట్టుపక్కల సత్తుపల్లి,వేంసూరు,కల్లూరు,తల్లాడ,పెనుబల్లి,తిరువూరు మండలాల నుండి నేత్ర సమస్యలు ఉన్న ప్రజలు ఎండను సైతం లెక్కచేయకుండా భారీగా తరలి వచ్చారు.వారి దాహార్తిని తీర్చేం దుకు స్థానికంగా గల వాటర్ సర్వీసింగ్ సెంటర్ నిర్వాహకులు గుడ్ల లక్ష్మణరావు ఉచిత మసాల మజ్జిగ పంపిణీ చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరువూరు పట్టణానికి చెందిన జనరల్ మెడిసిన్ ప్రముఖ వైద్యులు ఉయ్యూరు చెన్నారెడ్డి తమ ఆసుపత్రి తరపున షుగర్,బీపీ మందులనుఉచితంగా పంపిణీచేశారు.అనంతరంనిర్వాహకులు జెన్నారెడ్డి విజయ నరసింహారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రజా సేవే నా దృక్పథం అని అన్నారు.నాలుగు లక్షల నేత్ర శస్త్ర చికిత్సలు చేసిన అపార అనుభవం కలిగిన కాకినాడ కిరణ్ నేత్ర వైద్యశాల వారు ఆరు సంవత్సరాలుగా అడుగుతుంటే నేటికి మూడొందల కిలోమీటర్ల దూరం నుండి వచ్చి ఉచిత వైద్య శిబిరంనిర్వహించడం చాలా సంతోషంగా ఉందని వారికి,పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం నిర్వహించడానికి అనుమతి ఇచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు,పలు సేవలు చేసిన జూనియర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్. విద్యార్థులకు, విశ్రాంత ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.మొత్తంగా 462 మంది పాల్గొని పరీక్షలు చేయించుకోగా వారిలో 150 మందికి శస్త్ర చికిత్స



అవసరమని వైద్యులు నిర్ధారణ చేసినట్లు అందులో తక్షణమే 70 మంది రోగులను కిరణ్ నేత్ర వైద్యశాల వారు ఉచిత బస్సులలో కాకినాడ ఆసుపత్రికి శస్త్ర చికిత్స చేయడానికి తరలించారని స్పష్టం చేశారు.చికిత్స అనంతరం వారిని తిరిగి మరలా వారే బంజర్ కు ఈ నెల 21 వ తేదీ మంగళవారం పంపుతారని,మిగిలిన 80 మందిని ఈ నెల 22 వ తేదీ బుధవారం శస్త్ర చికిత్స కొరకు తీసుకెళ్తారని తెలిపారు.శ్రీ రాజసాయి మందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో ఇప్పటికీ 11 వేల పై చిలుకు మందికి ఉచిత కంటి ఆపరేషన్‌లు చేయించుకొని తిరిగి కంటి చూపును పొందారని బాబా కృపతోముందుకుసాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.వి.ఆర్.కె.దత్తు,టీచర్ మామిళ్ళపల్లి నరసింహారావు,వనమా నాగేశ్వరరావు,ఎన్ఎస్ఎస్ రత్నాకర్, అన్నపురెడ్డి శ్రీనివాస్,సైకిల్ శ్రీను, కె.శివకృష్ణ, నీలాపు ఉమారాణి, జె.జ్యోతి, భీమిరెడ్డిశ్యామల, సాయిమణికంఠ తదితరులు పాల్గొన్నారు.



## వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర,అక్షిత న్యూస్:** ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో పడతాయని ఎమ్మెల్యే జియంఆర్ అన్నారు, గ్రేడ్-ఏ రకం (సన్నాలు) ధాన్యం క్వింటాకు రూ.2,389, సాధారణ రకం క్వింటాల్ కు రూ.2,350 మద్దతు ధర ఇస్తామని, సన్నరకం ధాన్యం క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇస్తామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన ధ్యేయమని అన్నారు, రైతుల తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకో



కుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మాలని రైతులకు సూచించారు. రైతులెవరు ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో ముందస్తు గానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని పేర్కొన్నారు, ధాన్యం కొనుగోళ్లు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, గన్ని బ్యాగులు అవసరం ఉంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని అధికారులను కోరారు, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావల్సిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడం దుర్మార్గపు చర్య

### ఆలేరు బిజెపి పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్

**ఆలేరు, అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం కాంగ్రెస్, ఇండియా ఐ ఎన్ డి ఐ కూటమి పార్టీల ద్వారా ద్వంద్వ నీతికి నిదర్శనం అని బిజెపి పట్టణ అధ్యక్షుడు నంద గంగేష్ మండిపడ్డారు. ఆదివారం రోజున స్థానిక ఆలేరు రైల్వే గేట్ సమీపంలో ఆయన ఆధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో మహిళలకు సముచిత స్థానం కల్పించేందుకు ప్రధాని మోదీ ప్రభుత్వం మహిళల రిజర్వేషన్ బిల్లు తీసుకొస్తుంటే ప్రతిపక్ష రాజకీయ లబ్ధి కోసం దాన్ని అడ్డుకోవడం



అత్యంత దుర్మార్గమని విమర్శించారు. మహిళా హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలను మహిళా లోకం ఎన్నడికి క్షమించదని అన్నారు. పట్టణ సెక్రెటరీ సుంకరి సృజన్ కుమార్ గౌడ్, జిల్లా సెక్రటరీ కామిటికారి కృష్ణ మాట్లాడుతూ మహిళా సాధికారతకు బిజెపి పార్టీ కట్టుబడి ఉంటే ఇండియా కూటమి మాత్రం అడ్డంకులు సృష్టించిందని తెలిపారు. సీనియర్ నాయకులు చిరిగే శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల పట్ల విపక్ష చూపుతున్న ఈ పార్టీలకు రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోట మల్లయ్య, మర్రెడ్డి నరసింహారెడ్డి, సముద్రాల శ్రీనివాస్ ఐడియా, గుర్రం నర్సింహులు, సుక్క రాజు, జూకంటి సంపత్, సబ్బని సుభాష్, పూల అనుమంతు, తోట వెంకటయ్య, బైరి మహేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యాసదస్సు

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:**

ఆదివారం ఉదయం 11 గంటలకు సత్తుపల్లి పట్టణంలో విద్యా సదస్సు సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ ఖమ్మం వారు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు వివిధ రకాల ఉద్యోగస్తులు మరియు వ్యాపారవేత్తలు పాల్గొనడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ రవికుమార్ హాజరై మాట్లాడుతూ నాటి విద్యా విధానం నేటి విద్యా విధానం గురించి వివరిస్తూ పిల్లలకు ఎటువంటి ప్రయోజనకర విద్యా విధానం అందించాలని పలు ఆసక్తికర అంశాలు విద్యా విధానంపై మాట్లాడడం జరిగింది. ఈ సదస్సు నందు సెడార్ వ్యాలీ స్కూల్ సిబ్బంది వారు కూడా కేంబ్రిడ్జి కరికులం గురించి కార్యక్రమంలో పాల్గొన్న వారికి చక్కగా వివరించడం జరిగింది. ఖమ్మం పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో సెడార్ వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూలును సందర్శించి మీకు అన్ని విధాలుగా నచ్చితేనే మీ పిల్లలను మా స్కూల్ నందు చేర్పించండి వారికి బంగారు భవిష్యత్తు అందిస్తామని చెప్పడం జరిగింది. ఈ విద్యా సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులందరూ కూడా చక్కగా స్పందించి అభినందించారు .




# ఉత్తమ ఆర్థో వైద్యుడుగా అవార్డ్ అందుకున్న పుట్టరాజ్

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి..**

బిహెచ్ఈఎల్ జనరల్ ఆసుపత్రిలో రెండు దశాబ్దాలుగా ఆర్థోపెడిక్ వైద్యుడిగా విధులను నిర్వహిస్తూ మెరుగైన వైద్య సేవలను అందిస్తున్న వైద్యరత్న అవార్డు గ్రహీత డాక్టర్ పుట్ట రాజ్‌కు ఉత్తమ ఆర్థో వైద్యుడిగాఎంపికై ఆయన అవార్డును అందుకున్నారు. నిత్యం అందిస్తున్న వైద్య సేవలకు గుర్తింపుగా గతంలో పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చే ఉత్తమ వైద్యుడిగా అవార్డులను అందుకున్నారు. ఆరోగ్య రక్షణ పై రాసిన పుస్తకాలు యువత విశ్వనాలకు బానిసలు కాకుండా తీసుకోవాల్సిన చర్యలు గ్రామాల్లో చేపట్టిన ఉచిత వైద్య సేవలకు గుర్తింపుగా కర్ణాటక మీడియా క్లబ్ అసోసియేషన్ కర్ణాటక



రాష్ట్ర సోషల్ కల్చరల్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యుల జాతీయ సదస్సులో పుట్టరాజు వైద్యరత్న అవార్డు అందుకున్నారు. శనివారం రాత్రి నగరంలో పార్క్ హయత్ లో జరిగిన గ్లోబల్ లీడర్షిప్ వేడుకలు ప్రఖ్యాత నటి జయప్రద చేతుల మీదుగా ఆయనను ఘనంగా సన్మానించి ఉత్తమ ఆర్థో అవార్డును అందించారు. ఉత్తమ ఆర్థో వైద్యుడిగా అవార్డును అందుకోవడం పట్ల బీహెచ్ఈఎల్ యాజమాన్యం, పలువురు ఉన్నతాధికారులు కార్మికులు, వైద్యులు పుట్టరాజ్ కు అభినందనలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించారు.

# సిపిఐ (యంఎల్) న్యూ డెమోక్రసీలో 30 కుటుంబాలు చేరిక

**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:**

తిరుమలగిరి మండల కేంద్రంలో ఈదుల యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ చేరిక కార్యక్రమంలో సిపిఐ (యం ఎల్ ) న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు అనంతరెడ్డి పాల్గొని మాట్లాడుతూ నల్లగొండ జిల్లా తిరుమలగిరి ప్రాంతం ప్రజా ఉద్యమాలకు కేంద్రంగా ఉన్నది. ఈప్రాంతంలో దొరలకు,భూస్వాములకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు జరిగాయని ఆయన అన్నారు.

ఎంతో మంది విప్లవ కారులు తిరుమలగిరి ప్రాంతం నుండి ప్రజానాయకులుగా ఉద్యమ ప్రస్థానంలోకి వచ్చి ప్రజల హక్కుల కోసం పనిచేసిన చరిత్ర ఉన్నదని అన్నారు.

సి పి ఐ (యం ఎల్ ) న్యూ డెమోక్రసీ ఉమ్మడి నల్లగొండ జిల్లా లో ప్రజలకోసం నిరంతరం ఉద్యమాలు చేస్తుందని, అలాగే ప్రజలపై ప్రభుత్వాలు కొనసాగిస్తున్న నిర్బంధాలు సైతం లెక్క చేయకుండా ప్రజల పక్షాన దృఢంగా నిలబడి పోరాడుతుందని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం బ్రాహ్మణీయ హిందూత్వ భావజాలంతో దేశ ప్రజలను విభజించి పాలిస్తూ ప్రజమధ్య మత చిచ్చులు పెడుతూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారం లోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అనేక హామీలను ఇచ్చిందని,కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా మాయ మాటలతో పరిపాలన చేస్తూ కాలయాపనచేస్తుందని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈరోజు తిరుమలగిరి ప్రాంతం నుండి వివిధ సంస్థలనుండి సి పి ఐ (యం ఎల్ ) న్యూ డెమోక్రసీ లో చేరడం ఈప్రాంత ప్రజా




ఉద్యమాలను బలోపేతం చేయడానికి దోహదపడుతుందని ఆయన అన్నారు.

ఇంకా ఈకార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బానోత్ రాంసింగ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్మంతరెడ్డి భాస్కర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. న్యూ డెమోక్రసీలో చేరిన వారు ఈదుల యాదగిరి, జానీ బేగం, చాగంటి నర్సమ్మ, కుంటూరి కుమారి,తోట మంగమ్మ,విజయ, దాసరి లక్ష్మీ, దొండ విజయ,కాళ్ళ సోమలక్ష్మి,తోట పద్మ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్ కార్యక్రమం



**- అన్ని శాఖల అధికారులు పాల్గొనాలి..**

**- భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్**

**భద్రాచలం (అక్షిత ప్రతినిధి):** సోమవారం నాడు భద్రాచలం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని ఆయన కోరారు.. సంబంధిత యూనిట్ అధికారులు ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

# కవిత సమక్షంలో జాగృతిలో చేరిన మాజీ ఎమ్మెల్యే

**- కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పిన బోథ్ మాజీ ఎమ్మెల్యే బాపురావ్**

**అక్షిత ప్రతినిధి/ ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మాజీ శాసనసభ్యుడు రాథోడ్ బాపూరావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.

ఈనెల 25న కొత్త రాజకీయ పార్టీగా ఆవిర్భవించే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో ఆదివారం చేరిన బాపూరావు కొత్త పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. 2014, 2019 ఎన్నికల్లో రెండుసార్లు వరుసగా బోథ్ నియోజవర్గం నుండి టిఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన రాథోడ్ బాపురావు ఆ తర్వాత పార్టీ టికెట్ దక్కకపోవడంతో బిజెపిలో కొంతకాలం కొనసాగారు.

ఆ తర్వాత రెండేళ్లుగా కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని రాజకీయాల్లో ఉంటున్న బాపూరావు కాంగ్రెస్ అనుసరిస్తున్న నియంతృత్వ విధానాలు నచ్చకనే పార్టీని వీడుతున్నట్టు స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తమలాంటి గిరిజన నేతలను ఎన్నడూ పట్టించుకోలేదని, పార్టీలో తగినంత గౌరవం కూడా ఇవ్వలేదని ఆయన తెలిపారు.

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రోద్బలంతోనే తనకు అప్పట్లో టికెట్ వచ్చిందని, జిల్లాలో తెలంగాణ జాగృతిని బలోపేతం చేసినట్టు తెలిపారు. వచ్చే మే నెలలో ఇచ్చోడ కేంద్రంలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి కొత్త రాజకీయ పార్టీని గ్రామస్థాయి వరకు తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

రాథోడ్ బాపూరావుతో సహా పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు , కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు తెలంగాణ జాగృతి కండువా కప్పుకున్నారు.

**కవిత బాటలో లోక భూమారెడ్డి..?**

కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, రాష్ట్ర మాజీ డైరీ



కార్పొరేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీని వీడనున్నట్టు తెలిసింది. కొంతకాలంగా ఆ పార్టీకి దూరంగా ఉంటున్న భూమారెడ్డి కల్వకుంట్ల కవితతో సమాలోచనలు జరపడం చర్చనీయాంశంగా మారింది.

మరో నాలుగు ఐదు రోజుల్లో కవిత సమక్షంలోనే కొత్త రాజకీయ పార్టీలో లోక భూమారెడ్డి చేరనున్నట్టు ఆయన వర్గీయులు తెలిపారు.

# అర్రైవ్ అలైవ్ కార్యక్రమం విజయవంతం

### భద్రత పాటిస్తున్న వాహనదారులకు పూలతో అభినందనలు

### కోయిలకొండ సబ్ ఇన్స్పెక్టర్ తిరుపాజి

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యచరణలో "అర్రైవ్ అలైవ్" కార్యక్రమం చివరి రోజు కోయిల్‌కొండ మండలంలో విజయవంతంగా జరిగింది.

ఈ సందర్భంగా కోయిల్‌కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో సబ్ ఇన్స్పెక్టర్ తిరుపాజి వాహన దారులను తనిఖీ చేస్తూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం వంటి భద్రతా నియమాలను పాటిస్తున్న వారికి పూలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

గత ఆరు రోజులుగా పోలీసు శాఖ మరియు ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రజలలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపాజి మాట్లాడుతూ,

"హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చు. ఈ నియమాలను పాటిస్తూ సత్ప్రవర్తనతో ముందుకు వస్తున్న ప్రజలను అభినందిస్తున్నాము. కొంతమందైనా మార్పు చూపించడం మాకు ఆనందాన్ని కలిగిస్తోంది" అని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు కోయిల్‌కొండ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించబడింది.





ప్రతీ వాహనదారు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి ప్రయాణించి తమ ప్రాణాలను కాపాడుకోవాలి. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత.

# ప్రజావాణి కార్యక్రమం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### - భద్రాచలం మండల తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు


**భద్రాచలం (అక్షిత ప్రతినిధి):** సోమవారం నాడు ఉదయం గం. 10:30 ని. ల నుండి మధ్యాహ్నం 1.00 గం. ల వరకు భద్రాచలం తహశీల్దార్ కార్యాలయం యందు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని మండల తాహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు ఆదివారం నాడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు..



నేడు జరగనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల మండలాధికారులు పాల్గొనాలని అధికారులకు ఆదేశించారు.. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని ఆయన కోరారు. అందుకు ప్రజలందరూ తప్పనిసరిగా ఈ ప్రజావాణికి వచ్చి దరఖాస్తులను సమర్పించాలని ఆయన తెలుపుతూమండల ప్రజలు ఇట్టి అవకాశమును సద్వినియోగ పరచుకొనవలసినదిగా మండల తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు కోరారు.

# విజయవంతంగా ముగిసిన గురుకుల ఆర్‌సిఓ ప్రతిభ ప్రవేశ పరీక్షలు

**భద్రాచలం (అక్షిత ప్రతినిధి):** తెలంగాణ గిరిజన గురుకుల సి ఓ ఈ కళాశాలలో ప్రవేశం కొరకు నిర్వహించిన ప్రతిభ ప్రవేశ పరీక్షలు విజయవంతంగా ముగిశాయని గురుకులం ఆర్ సి ఓ, పరీక్షల పరిశీలన అబ్జర్వర్ అరుణకుమారి తెలిపారు..



ఆదివారం భద్రాచలంలోని సి ఓ ఈ కళాశాలలో జరుగుతున్న ప్రవేశ పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాత ఖమ్మం జిల్లా పరిధిలో మొత్తం ఐదు సెంటర్లలో ప్రతిభా ప్రవేశ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిలో ప్రతిభ పాఠశాల ఖమ్మం, తెలంగాణ గిరిజన గురుకుల ప్రతిభకళాశాల దమ్మపేట, తెలంగాణ గిరిజన గురుకుల బాలికల కళాశాల సుదిమల్ల, తెలంగాణ గిరిజన గురుకుల బాలికల కళాశాల భద్రాచలం, తెలంగాణ గిరిజన గురుకుల బాలికల పాఠశాల లు ఉన్నాయి.. ఈ నేపథ్యంలో ఆదివారం భద్రాచలంలో పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.. ఈ ఐదు పరీక్షా కేంద్రాల నందు 1692 మంది విద్యార్థినీ విద్యార్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు వచ్చి చేసుకోవడం జరిగిందని, దానిలో 1468 మంది హాజరైనారని, 254 మంది గైరాజరైనారని, మొత్తం ఎంపీసీ బాలురు 773 గాను 672 మంది, అదేవిధంగా బాలికలు 406 గాను 363 మంది, బైపిసికి సంబంధించి బాలురు 332 కు గాను 276 మంది, బాలికలు 587 గాను 520 మంది మొత్తం 88.59% శాతం పరీక్షలకు హాజరైనట్లు ఆమె తెలిపారు. ఈ పరీక్షలు జరిగిన అన్ని సెంటర్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు.

# హిందూ ధర్మ రక్షణకు నడుం బిగిద్దాం

### హిందూ సమ్మేళనంలో శ్రీశ్రీశ్రీ ముక్తానంద స్వామీజీ

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** హిందూ ధర్మ రక్షణకు ప్రతి హిందువు నడుం బిగించాలని శ్రీశ్రీశ్రీ ముక్తానంద స్వామీజీ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్ లోని బృందావన్ గార్డెన్ లో హిందూ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన స్వామీజీ మాట్లాడుతూ హిందుత్వము మానవాళి హితం కోరే ధర్మమని, హిందువు మతతత్వవాది కాదని ఆయన చెప్పారు. మతం వేరు, ధర్మం వేరు అని పేర్కొన్నారు. హిందువుగా హిందూ ధర్మాన్ని, సంస్కృతిని తెలుసుకుని ఆచరించాలని వివరించారు. కుటుంబం నుండి పరివర్తన కొరకు మహిళలు పాటుపడాలని కోరారు. దేవాలయాలను శక్తివంతము చేయాలని అన్నారు. హిందువులు




కులాల వారీగా విభజించబడడం హేయమని, హిందువులు సమైక్యంగా కలిసి జీవించాలని అన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ఆర్ ఎస్ ఎస్ విభాగ్ సంపర్క్ ప్రముఖ్ ఎన్నమనేని అశోక్ రావు మాట్లాడుతూ దేశంలో హిందూ సంఘటన అవసరమని చెప్పారు. హిందువులు స్వాభిమానం, దేశభక్తి, సేవాభావం పెంపొందించుకోవాలని సూచించారు. దేశభక్తి సంస్థ ఆర్.ఎస్.ఎస్. అని, దేశభక్తులను తయారుచేయటమే



ఆర్.ఎస్.ఎస్. వందేళ్ళుగా చేస్తుందని వివరించారు. మరొక మహిళా వక్త నీలిమా మాట్లాడుతూ పంచపరివర్తనతో కుటుంబంలో మార్పులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కుటుంబ జీవన విలువలు, సామాజిక సమరసత, స్వదేశీ, పర్యావరణ పరిరక్షణ, పౌర విధులు అందరము పాటించాలని పేర్కొన్నారు. సమ్మేళనంలో పాఠశాల విద్యార్థులచే వేయబడిన నాటికలు, సాంస్కృతిక నృత్యాలు అందరిని ఆకట్టుకున్నవి. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంతో, భజనలతో సమ్మేళనం ఆద్యంతం ఆనందంగా ,కోలాహలంగా జరిగింది.

హిందూ సమ్మేళన నిర్వహణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు గూడ అశోక్ రెడ్డి, మేకల ఓంప్రకాశ్, డిప్యూటి మేయర్ సునీల్ రావు, కార్పోరేటర్‌లు నాంపల్లి రేణుక శ్రీనివాస్, సాగాని కొమురయ్య మరియు దక్షిణామూర్తి, నాగరాజు, గజేందర్, రవీందర్, రాజిరెడ్డి, మల్లారెడ్డి, మామిడి రమేశ్, ఆదిరెడ్డి, భగత్ నగర్ బస్తీ లోని వివిధ కాలనీల నుండి తరలివచ్చిన హిందూ బంధువులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నూతన బ్రాంచ్ ప్రారంభం

### ముఖ్యఅతిథులుగా మంత్రి జూపల్లి, జెడి లక్ష్మీనారాయణ

**మహబూబ్ నగర్,అక్షిత న్యూస్:** మహబూబ్ నగర్ జిల్లా మహబూబ్ నగర్ మున్సిపల్ బైపాస్‌లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా మాజీ సీబీఐ జేడీ వి.వి. లక్ష్మీనారాయణ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కోత్వాల్, సయ్యద్ ఇబ్రహీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి



కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో నాణ్యమైన విద్య ఎంతో కీలకమని తెలిపారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వంటి విద్యాసంస్థలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నాయని అభినందించారు.

మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సయ్యద్ ఇబ్రహీం మాట్లాడుతూ.. మహబూబ్ నగర్ ప్రాంతంలో ఈ విద్యాసంస్థ ప్రారంభం కావడం స్థానిక విద్యార్థులకు



ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ మమత శ్రీనివాస్, కార్పొరేటర్లు ఎ. రామస్వామి, నరసింహులు, ఉమర్ కోత్వాల్, పూజిత, మాజీ మున్సిపల్ చైర్మన్ పాఠశాల యాజమాన్యం మొహమ్మద్ యూనుస్, విక్రం రానా, విద్యార్థులు, తల్లిదండ్రులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు.